

చేవెళ్ల రూరల్ : ఆలూర్‌లో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



ఇబ్రహీంపట్నం : ఎలిమినేడులో బీఆర్‌ఎస్ నాయకులతో సమావేశమైన మాజీ వైస్‌ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి

# కాంగ్రెస్ నేతల్లో వణుకు పుట్టాలి

- రజతోత్సవ సభకు భారీగా తరలివెళ్దాం.. సభను విజయవంతం చేద్దాం
- బీఆర్‌ఎస్ నాయకుల పిలుపు
- గులాబీ సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

చేవెళ్ల రూరల్, ఏప్రిల్ 19 : వరంగల్‌లోని ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహిస్తున్న రజతోత్సవ సభకు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి కాంగ్రెస్‌కు దడ పుట్టించాలని పార్టీ నేతలు పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని ఆలూరులో పార్టీ నాయకుల ఆధ్వర్యంలో రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమాన్ని కోరే బీఆర్‌ఎస్ పార్టీనే రాష్ర్టానికి శ్రీరామరక్ష అని అన్నారు. ఈ కార్యక్రమానికి గులాబీ దండు భారీగా తరలి వచ్చి కాంగ్రెస్ నేతల్లో వణుకు పుట్టించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు శేఖర్, గ్రామ అధ్యక్షుడు షాబాద్ శ్రీనివాస్, ఆలూర్ మాజీ ఉప సర్పంచ్, పార్టీ గ్రామ వర్కింగ్ ప్రెసిడెంట్ కసిరె వెంకటేశ్, స్థానిక నాయకులు మహ్మద్ ఫాయుమ్, శ్రీనివాస్, ప్రభాకర్, కుమార్, పృథ్వీరాజ్, బాబు, నగేశ్, కె.నర్సింహులు, ఎస్.నర్సింహులు, ఖదీర్, అమర్, బాలరాజ్, ప్రవీణ్, జె.రవి, రాజు, పి.నర్సింహులు, హన్మంతు, సి.వెంకటేశ్, గోపాల్, టి.ప్రవీణ్, సిరాజు తదితరులు పాల్గొన్నారు.

**ఎలిమినేడు నుంచి భారీగా తరలివెళ్దాం..**

**ఇబ్రహీంపట్నం :** వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ సిల్వర్ జూబ్లీ బహిరంగ సభకు మండల పరిధిలోని ఎలిమినేడు నుంచి భారీ సంఖ్యలో తరలి వెళ్లేందుకు ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడి పని చేయాలని మాజీ వైస్ ఎంపీపీ, పార్టీ సీనియర్ నాయకుడు మంచిరెడ్డి వెంకటప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎలిమినేడులో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామం నుంచి అధిక సంఖ్యలో తరలి వెళ్లేందుకు అందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమాను లు, శ్రేయోభిలాషులు గులాబీ సభకు తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హామీలను అమలు చేయలేకే డైవర్షన్ పాలిటిక్స్

**మొయినాబాద్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నదని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ 25 ఏండ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న రజతోత్సవ మహాసభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం ఆయన మొయినాబాద్ మున్సిపాలిటీ కేంద్రంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించి మాట్లాడారు. అలవి కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటిని అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నదని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలను అటకెక్కించిందన్నారు. వరంగల్‌లో జరిగే మహాసభకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలు, అభిమానులు తరలివెళ్లి సక్సెస్ చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రవియాదవ్, అంజయ్యగౌడ్, విష్ణువర్ధన్‌గౌడ్, కృష్ణమాచారి, మాజీ సర్పంచ్‌లు సుధాకర్‌యాదవ్, మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మాణిక్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ కృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ రాము, నాయకులు పరమేశ్, షాబాద్ ప్రవీణ్, రాజుగౌడ్, జగన్, కరంచంద్, రాములు తదితరులు పాల్గొన్నారు.



మొయినాబాద్ : రజతోత్సవ మహాసభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

# భూ భారతితో సులభంగా సమస్యల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

చేవెళ్ల రూరల్, ఏప్రిల్ 19 : ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంతో సులభంగా సమస్యలు పరిష్కారం అవుతాయని మండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం 2025 అవగాహన సదస్సును చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహేందర్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే కాలె యాదయ్య, కలెక్టర్ నారాయణ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. నేరుగా ఆర్డీవో, తహసీల్దార్, కలెక్టర్ ఈ విధంగా క్రమ పద్ధతిలో రైతులు తమ భూ సమస్యలు పరిష్కరించు కోవడానికి వీలుంటుందన్నారు. కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. రాబోవు తరాలకు భూ సమస్యలు లేకుండా సులభతరంగా వాటిని పరిష్కరించుకునేలా చట్టాలు రూపకల్పన చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సభ్యుడు చింపుల సత్యనారాయణ రెడ్డి, ఆర్డీవో చంద్రకళ, తహసీల్దార్లు కృష్ణయ్య, సురేందర్, చేవెళ్ల డీటీ రాజేంద్ర, ఎంపీడీవోలు హిమబిందు, వెంకయ్యగౌడ్, ఎంపీవో విఠలేశ్వర్ జీ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, వైస్ చైర్మన్ రాములు, సీనియర్ నాయకులు సున్నపు వసంతం, మర్పల్లి కృష్ణారెడ్డి, చేవెళ్ల, ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్లు దేవర వెంకట్ రెడ్డి, గోనె ప్రతాప్ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, చేవెళ్ల మాజీ సర్పంచ్ శైలజాఆగిరెడ్డి, సంబంధిత అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, మాజీ ప్రజా ప్రతినిధులు, నేతలు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

- 2285లబ్ధిదారుల గుర్తింపు
- నాలుగు దశల్లో వారి ఖాతాల్లో డబ్బుల జమ
- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్



మర్పల్లి : అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, ఏప్రిల్ 19 : అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పథకానికి సంబంధించి బేస్‌మెంట్ స్థాయి వరకు నిర్మాణం పూర్తయితే రూ.లక్ష, పైకప్పు స్థాయి దాటిన తర్వాత రూ.లక్ష, స్లాబ్ పూర్తయ్యాక రూ.2లక్షలు, మొత్తం పనులు పూర్తి కాగానే మిగిలిన రూ.లక్ష మొత్తం కలిపి రూ.5లక్షలు లబ్ధిదారులకు చెల్లిస్తున్నట్లు తెలిపారు. పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లా మొదటి విడుతలో మొ త్తం 2285 మంది లబ్ధదారులను గుర్తించామన్నారు. వీరిలో 340 మంది లబ్ధిదారుల ఇండ్ల నిర్మాణాలకు మార్కింగ్ చేసినట్లు తెలిపారు. 45 మంది బేస్‌మెంట్ స్థాయి వరకు ఇండ్ల నిర్మాణం చేపట్టారని తెలిపారు. తొలి విడుతగా బేస్‌మెంట్ పూర్తి చేసిన లబ్ధిదారుల ఖాతాల్లో రూ.లక్ష జమ చేశామన్నారు. మిగ తా లబ్ధిదారులు కూడా ఇండ్ల నిర్మాణ పనుల ను వేగవంతం చేయాలన్నారు. రెండో దశలో లబ్ధిదారుల ఎంపిక నిర్వహిస్తామన్నారు. మిగిలిన గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు ఈ నెల 22 నుంచి 30వరకు మండల స్థాయి అధికారులు పరిశీలించి, ప్రక్రియ ను పూర్తి చేస్తారని తెలిపారు. మే 2న గ్రామ పంచాయతీ, వార్డు కార్యాలయాల్లో లబ్ధిదారుల జాబితాను ప్రదర్శిస్తామన్నారు. మే 5న అర్హులైన లబ్ధిదారులకు మంజూరు ఇస్తామని కలెక్టర్ తెలిపారు.

**కొత్త ఆర్‌వోఆర్ చట్టంపై అవగాహన**

**మర్పల్లి :** భూ భారతితో భూ సమస్యలు శాశ్వత పరిష్కారమవుతాయని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు.. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో భూ భారతి కొత్త ఆర్‌వోఆర్ చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, ఆర్డీవో వాసు చంద్ర, తహసీల్దార్ మునిరొద్దీన్, చైర్మన్ మహేందర్ రెడ్డి, నాయకులు సురేశ్ యాదవ్, కృష్ణారెడ్డి, రవీందర్, సలీం, జగదీశ్వర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యాసంగి పంట కొనుగోలుకు చర్యలు

వికారాబాద్, ఏప్రిల్ 19 : ప్రణాళిక ప్రకారం యాసంగి పంట కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి మంత్రి సన్న బియ్యం సరఫరా, ధాన్యం కొనుగోలుపై పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌తో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... అకాల వర్షాల కారణంగా రైతులు నష్టపోకుండా నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలని మంత్రి సూచించారు. వాన కాలంలో 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, యాసంగిలో 127.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పంట పండిందన్నారు. వానకాలం పంట కొనుగోళ్లు సజావుగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించినందుకు కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌర సరఫరాల అధికారులు, ఇతర సిబ్బందిని మంత్రి అభినందించారు. వాన కాలం కంటే అదనంగా యాసంగి సీజన్‌లో 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని మంత్రి తెలిపారు. ధాన్యం కొనుగోలు అంశంపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, సివిల్ సప్లయ్ అధికారి మోహన్ బాబు, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఉద్యోగోన్నతి పొందిన హెడ్ కానిస్టేబుళ్లను అభినందిస్తున్నఎస్పీ నారాయణరెడ్డి

# 17 మంది కానిస్టేబుళ్లకు ఉద్యోగోన్నతి

వికారాబాద్, ఏప్రిల్ 19 : జిల్లా పోలీస్ శాఖలో సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తున్న 17 మంది పోలీస్ కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా ఉద్యోగోన్నతి లభించిందని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో నూతనంగా ప్రమోషన్ పొందిన హెడ్ కానిస్టేబుళ్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగోన్నన్నతి కేవలం హోదాలో మార్పు మాత్రమే కాదని, మరింత పెరిగిన బాధ్యత అని గుర్తుంచుకోవాలని సూచించారు. హెడ్ కానిస్టేబుల్‌గా విధి నిర్వహణలో మరింత అంకితభావం, క్రమశిక్షణ, నిజాయితీ, వృత్తి నైపుణ్యంతో పనిచే యాలని దిశానిర్దేశం చేశారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగుతూ, వారి సమస్యలపై మానవతా దృక్పథంతో స్పందించి, చట్ట పరిధిలో వారికి సత్వర న్యాయం అందించేందుకు కృషి చేయాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో హెడ్ కానిస్టేబుళ్ల పాత్ర అత్యంత కీలకమని, నిబద్ధతతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని, తద్వారా జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ నియమ నిబంధనలు, చట్టాలను గౌరవిస్తూ, ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ తమ పరిధిలోని జూనియర్ సిబ్బందికి ఆదర్శంగా నిలవాలని తెలిపారు. సమావేశంలో ఉద్యోగోన్నతి పొందిన హెడ్ కానిస్టేబుళ్లు ఆనందం వ్యక్తం చేసి, ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, మరింత ఉత్సాహంతో పని చేస్తామని వారు పేర్కొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి
- అన్మాస్‌పల్లిలోని ఎర్త్ సెంటర్‌లో యూత్ లీడర్స్-కాన్‌క్లేవ్ బెటర్ ఎర్త్ కార్యక్రమం
- పాల్గొన్న పర్యావరణవేత్తలు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు




సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

కడ్తాల్, ఏప్రిల్ 19 : పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిదని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వీ.బాలకిష్టారెడ్డి అన్నారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ సంస్థ 15 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం మండల పరిధిలోని అన్మాస్‌పల్లి సమీపంలో ఉన్న ఎర్త్ సెంటర్‌లో... సీజీఆర్ సంస్థ చైర్మన్ లీలమ్మ అధ్యక్షతన యూత్ లీడర్స్-కాన్‌క్లేవ్ బెటర్ ఎర్త్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాలకిష్టారెడ్డి హాజరై మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ, సమాజ శ్రేయస్సు కోసం సీజీఆర్ సంస్థ ఆధ్వర్యంలో పుడమితల్లికి చేస్తున్న సేవ అభినందనీయమన్నారు. కాలుష్య కోరల్లో నుంచి పర్యావరణాన్ని రక్షించుకునే బాధ్యతను యువత, విద్యార్థులు తీసుకోవాలన్నారు. పర్యావరణంపై సరైన సిలబస్‌ను తయారు చేసి ఉన్నత విద్యలో ప్రవేశపెడతామన్నారు. ఇందుకు సీజీఆర్ అందించే సలహాలు, సూచనలను పాటిస్తామని తెలిపారు. సీజీఆర్ సంస్థ చైర్మన్ లీలమ్మ మాట్లాడుతూ.. ప్రజల ఆలోచన విధానంపైనే సమాజం ఆధారపడి ఉన్నదన్నారు. వందేమాతరం ఫౌండేషన్ చైర్మన్ రవీందర్ మాట్లాడుతూ.. భూమిపై ఉన్న ప్రకృతిని పరిరక్షించుకోవాలని తెలిపారు. ఆర్టీఐ మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి మాట్లాడుతూ ఇతర దేశాలతో పోలిస్తే మన దేశంలోనే యువత ఎక్కువగా ఉన్నదని, ప్రకృతిని కాపాడుకోవడానికి యువత ఎప్పుడు ముందుండాలని తెలిపారు. ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడుకోవాలని రాజ్యాంగంలోనే పొందుపర్చారని తెలిపారు. భవిష్యత్ తరాల కోసం సీజీఆర్ సంస్థ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో సీజీఆర్ వ్యవస్థాపకుడు లక్ష్మారెడ్డి, పర్యావరణవేత్తలు నర్సింహారెడ్డి, సాయిభాస్కర్‌రెడ్డి, కార్యక్రమ నిర్వాహకులు నవీన్‌రావు, డాక్టర్ జగన్, ప్రియ, వసంతలక్ష్మి, సీజీఆర్ సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి

- హెల్ప్ ఆల్ సొసైటీ (బాలుర) వసతి గృహం తనిఖీ
- అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



హెల్ప్‌ఆల్ సొసైటీ వసతి గృహాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, ఏప్రిల్ 19 : నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. శనివారం మోమిన్‌పేట మండల పరిధిలోని జిల్లా చైల్డ్ కేర్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు హెల్ప్ ఆల్ సొసైటీ (బాలుర) వసతి గృహాన్ని తనిఖీ చేశారు. అనంతరం జిల్లా శిశు సంక్షేమ అధికారి (ఎఫ్‌ఏసీ) జయసుధతో కలిసి (బాలుర) వసతి గృహాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. డార్మెంటరీ, వాష్ రూమ్‌లను పరిశీలించి, సెక్యూరిటీ, పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారా? మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? తదితర వివరాలు వార్డెన్లను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట సీడబ్ల్యూసీ కమిటీ సభ్యులు ఉన్నారు.

**భూ రికార్డుల నమోదు మరింత సులభతరం**

**బంట్వారం :** భూ భారతితో భూ రికార్డుల నమోదు మరింత సులభతరం అవుతుందని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ చెప్పారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో భూ భారతిపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి సందేహాలు ఉన్నా అధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వాసుచంద్రదేవ్, తహసీల్దార్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రహదారికి అడ్డుగా ప్రీ కాస్ట్ వాల్

- కూల్చివేసిన హైడ్రా అధికారులు
- ఆరు కాలనీల రాకపోకలకు తొలగిన ఇబ్బందులు



రహదారికి అడ్డుగా ఉన్న ప్రీ కాస్ట్ వాల్‌ను కూల్చివేయిస్తున్న హైడ్రా అధికారులు

తుర్కయాంజాల్, ఏప్రిల్ 19 : మున్సిపాలిటీ పరిధిలోని కమ్మగూడ సర్వే నంబర్ 213, 214లో రహదారికి అడ్డంగా ఏర్పాటు చేసిన ప్రీ కాస్ట్ వాల్‌ను శనివారం హైడ్రా అధికారులు కూల్చివేశారు. కొన్నేండ్ల క్రితం ఈ స్థలంలో రంగప్రసాద్ అనే వ్యక్తి లే అవుట్ చేసి ప్లాట్లను విక్రయించారు. ఈ సర్వే నంబర్‌లోని స్థలం తనదంటూ గోవింద్‌దాస్ కోర్టును ఆశ్రయించారు. కోర్టు తీర్పు గోవింద్‌దాస్‌కు అనుకూలంగా వచ్చింది. స్థలాన్ని కబ్జాలోకి తీసుకుని రెండేండ్ల క్రితం ప్రీ కాస్ట్ వాల్‌ను ఏర్పాటు చేయడంతో పలు కాలనీలకు వెళ్లే రోడ్డు సైతం అందులో ఉండడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇటీవల శ్రీరంగపురం కాలనీ వాసులతో పాటు మరో 6 కాలనీలకు చెందిన వారు హైడ్రాకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టిన అధికారులు శనివారం జేసీబీ సహాయంతో రహదారికి అడ్డుగా ఉన్న ప్రీ కాస్ట్ వాల్‌ను కూల్చివేశారు. సుమారు ఆరు కాలనీల రాకపోకలకు ఇబ్బందులు తొలగాయని స్థానిక కాలనీ వాసులు తెలిపారు. కూల్చివేతల్లో హైడ్రా అధికారులు, డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

## వరుస దొంగతనాలతో రైతుల ఆందోళన

షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్ 19 : మండల పరిధిలోని వెలిజర్లలో వరుస దొంగతనాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు తెలిపిన వివరాలు.. ఈ నెల 15న గుర్తు తెలియని వ్యక్తులు గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్, మరో రైతుకు చెందిన ట్రాక్టర్ బ్యాటరీలను అపహరించారు. అలాగే శుక్రవారం రాత్రి రైతులు శ్రీశైలం, కర్ణం వెంకటయ్య పొలాల్లో మోటర్లకు సంబంధించిన వైర్లు చోరీకి గురయ్యాయి. వరుసగా దొంగతనాలు జరుగుతుండడంతో పోలీసులు గ్రామంలో నిఘా వ్యవస్థను పెంచాలని, చోరీలు చేస్తున్న వారిని పట్టుకోవాలని కోరుతున్నారు.



వెలిజర్లలో రైతు పొలంలో మోటర్ వైర్లు దొంగిలించిన గుర్తు తెలియని వ్యక్తులు

# చంపుతాడనే భయంతోనే హత్య

- డబ్బుల కోసం స్నేహితుల మధ్య ఘర్షణ
- ఒకరి హత్య... ప్రధాన నిందితుడి అరెస్ట్..
- కారు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌చార్జి డీసీపీ చింతమనేని శ్రీనివాస్

శంషాబాద్ రూరల్, ఏపిల్ 19 ఆన్‌లైన్ గేమ్‌లో డబ్బులు పోగొట్టుకున్న వ్యక్తుల మధ్య జరిగిన గొడవలో ఓ యువకుడి హత్యకు గురైన ఘటన షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించింది. శంషాబాద్ ఇన్‌చార్జి డీసీపీ చింతమనేని శ్రీనివాస్ కథనం ప్రకారం.. లింగారెడ్డిగూడ శివారులో ఎంఎస్‌ఎన్ కంపెనీ సమీపంలో ఈ నెల 12వ తేదీన ఓ గుర్తు తెలియని యువకుడు మృతి చెంది పడి ఉన్నట్లు బొద్ద అర్జున్ సమాచారం ఇవ్వడంతో షాద్‌నగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. హత్యకు గురైన సదరు యువకుడు ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా బండి ఆత్మకూర్ మండలం చిన్నదేవులపురం గ్రామానికి చెందిన కిలరి సాయి రాహుల్(23)గా గుర్తించారు. అదే గ్రామానికి చెందిన శంకమురి వెంకటేశ్ ఇద్దరు చిన్నప్పటి నుంచి స్నేహితులు.. అయితే సాయిరాహుల్‌కు లెవెన్ విన్నర్స్ క్యాషినో అనే ఆన్‌లైన్‌గేమ్ అలవాటు ఉంది. ఆ గేమ్‌ను అతడి స్నేహితుడు వెంకటేశ్‌కు చూపించి ఆడమని ప్రోత్సహించాడు. దీంతో వెంకటేశ్ సైతం ఆ ఆటకు బానిసగా మారి ఆడుతూ దాదాపు రూ.15 లక్షలు పోగొట్టుకున్నాడు. గత వారం రోజుల క్రితం వెంకటేశ్ దగ్గర మూడు లక్షల రూపాయలు ఉన్నాయి. మరోసారి ఆన్‌లైన్ గేమ్ ఆడితే తాను గెలిచే విధంగా చేస్తాను డబ్బులు వస్తాయని ప్రోత్సహించాడు. దీంతో ఆన్‌లైన్‌గేమ్ ఆడగా ఉన్న రూ.మూడు లక్షలు గేమ్‌లో పోయాయి. దీంతో ఇద్దరు మధ్య డబ్బుల విషయమై గొడవ జరిగింది. దీంతో సాయి రాహుల్ తనకు డబ్బులు ఇవ్వాలని వెంకటేశ్ పలుమార్లు అడిగాడు. తాను ఇవ్వనని ఏంచేస్తావో చేసుకో ఎక్కువ మాట్లాడితే అంతు చూస్తా... చంపేస్తా నంటూ బెదిరించాడు సాయిరాహుల్ అన్నంతపని చేస్తాడని గ్రహించి అతడినే చంపాలని నిర్ణయించి హైదరాబాద్ శివారులోని సూరారంలో ఉన్న నంద్యాలకు చెందిన తన స్నేహితుడికి, కుత్బుల్లాపూర్‌లో ఉన్న మరో వ్యక్తి సహకారంతో సాయి రాహుల్‌ను చంపేస్తే మీకు డబ్బులు ఇస్తానని ఆశచూపాడు. దీంతో ఇద్దరు కలిసి కారును అద్దెకు తీసుకొని ఈ నెల 12 తేదీన రాత్రి 10.30 గంటలకు షాద్‌నగర్ సమీపంలోని లింగారెడ్డిగూడ సమీపంలోని నిర్మానుష్య ప్రదేశంలో వెంకటేశ్‌తో పాటు మరో ఐదుగురు కలిసి సాయి రాహుల్‌ను హత్య చేసి పారిపోయారు. ప్రధాన నిందితుడు వెంకటేశ్‌తో పాటు కారు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.మరో ఐదుగురు నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నట్లు వివరించారు. ఈ కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన షాద్‌నగర్ పోలీసులకు ఉన్నతాధికారుల చేత రివార్డులు అందిస్తామని తెలిపారు. సమావేశంలో శంషాబాద్ అదనపు డీసీపీ రామ్‌కుమార్,షాద్‌నగర్ సీఐ విజయ్‌కుమార్ ఉన్నారు.

# నగరంలో ఆబ్కారీ దాడులు



సిటీబ్యూరో, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ): నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఆబ్కారీ ఎస్‌టీఎఫ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి 2.301 కిలోల గంజాయితో పాటు ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే... నగరానికి చెందిన మహ్మద్ బిన్ బషీర్ విజయనగర్ కాలనీలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎస్‌టీఎఫ్ పోలీసులు దాడులు చేసి నిందితుడిని పట్టుకుని అరెస్టు చేశారు. అతడి నుంచి గంజాయి, ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును గోల్కొండ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. కాగా ఈ కేసుతో సంబంధం ఉన్న మహమూద్ జావేద్, హమీద్‌లపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. మరో కేసులో...కుత్బుల్లాపూర్ లో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న ఆబ్కారీ పోలీసులు దాడులు జరిపి 1.010కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఒకరిని అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. అయితే అరెస్టు చేసిన వ్యక్తి వివరాలను గోప్యంగా ఉంచడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## తెలుగు యూనివర్సిటీ పేరు మార్పు

తెలుగు యూనివర్సిటీ, ఏప్రిల్ 19: తెలంగాణ అస్తిత్వ ప్రకటనలో భాగంగా.. తెలంగాణ భాషా సాహిత్య సంస్కృతుల పరిరక్షణకు, పరిపోషణకు విశేష కృషి చేసిన సురవరం ప్రతాపరెడ్డి పేరును తెలుగు విశ్వవిద్యాలయానికి సీఎం రేవంత్‌రెడ్డి పెట్టడం స్ఫూర్తిదాయకంగా ఉందని వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య వెల్దండ నిత్యానందరావు, రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హన్మంతరావు అన్నారు. వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల పక్షాన ముఖ్యమంత్రి గారికి వారు కృతజ్ఞతలు తెలుపుతూ శనివారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన కొద్ది కాలంలోనే 2014లో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని జయశంకర్ విశ్వవిద్యాలయంగా, ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయాన్ని కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయంగా మార్చుకోవడం జరిగిందన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ, వీరనారి చాకలి ఐలమ్మ లాంటి తెలంగాణ వైతాళికుల పేర్లను కూడా రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలకు పెట్టడం జరిగిందని అన్నారు. సురవరం ప్రతాపరెడ్డి గోల్కొండ పత్రికను ప్రారంభించి తెలంగాణ ప్రజలలో పోరాటపటిమను, తెగువను, చైతన్యాన్ని నింపిన ధైర్యశాలిగా అభివర్ణించారు. అలాంటి వ్యక్తి పేరును తెలుగు వర్సిటీకి పెట్టుకోవడం తెలంగాణ ప్రజలందరికీ ఇచ్చిన గౌరవంగా భావించవచ్చన్నారు.

## నేడు పుస్తకావిష్కరణ

సిటీబ్యూరో, ఏప్రిల్19. (నమస్తే తెలంగాణ): మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ యాభై ఏండ్ల ప్రయాణంపై రచయిత నూతి మల్లన్న రాసిన 'ఒక ప్రస్థానం' పుస్తకావిష్కరణ ఆదివారం సాయంత్రం 5 గంటలకు నెక్లెస్‌రోడ్డులోని జలవిహార్‌లో జరగనున్నది. కార్యక్రమానికి పలువురు హాజరవుతారు.